సాక్షి అనకాపల్లి

బుధవారం । 25 । జనవరి । 2023



పార్కుకు స్థల పరిశీలన

బొజ్జన్న కొండ వద్ద, గ్రామానికి సమీపంలో పార్కు ఏర్పాటుకు డీపీవో శిరీషారాణి మంగళవారం స్థలపరిశీలన చేశారు. 8లో



ఘనంగా తీర్థ మహోత్సవం

చౌడువాడలో సీతారామాంజనేయ తీర్థం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందాలు నిర్వహించారు. 8లో

వాతావరణం

అనకాపల్లిటౌన్ : రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి మంగళవారం తెలిపారు. ఉష్ణోగ్రతలు 30.5 నుంచి 30.7 డిగ్రీలు, తేమ శాతం 81 నుంచి 83, గాలి గంటకు 5 కిలో మీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

క్లీన్ ఆంధ్రప్రదేశ్‌పై త్వరలో శిక్షణ

- ఏర్పాట్లు పరిశీలించిన డీపీవో శిరీషారాణి



నక్కపల్లిలో శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో

నక్కపల్లి: క్లీన్ ఆంధ్రప్రదేశ్, జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా త్వరలో నక్కపల్లిలో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి తెలిపారు. నక్కపల్లిలో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రా(ఎస్‌డబ్ల్యూపీసీ)న్ని మంగళవారం ఆమె సందర్శించారు. త్వరలోనే ఈ కేంద్రంలో డివిజన్‌లోని ఎనిమిది మండలాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, క్లాప్‌మిత్రల(స్వీపర్ల)కు శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. జిల్లాలో నక్కపల్లితో పాటు కశింకోట, చీడికాడ మండలాలను కూడా శిక్షణ తరగతుల నిర్వహణకు ఎంపిక చేసినట్టు తెలిపారు. ఆమె వెంట ఎంపీడీవో సీతారామరాజు, ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ, కార్యదర్శి రాజశేఖర్ ఉన్నారు.

హత్యకేసుపై ఏఎస్పీ వివరాల సేకరణ



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ సత్యనారాయణ

మునగపాక: మండలంలో గత ఏడాది అక్టోబర్ 14న జరిగిన ఓ హత్య కేసుపై ఏఎస్పీ సత్యనారాయణ మంగళవారం దర్యాప్తు చేశారు. నాగులాపల్లికి చెందిన యల్లపు గంగ మహలక్ష్మినాయుడు అనే వ్యక్తి హత్యకు గురై మూడు నెలలు పూర్తయినా ఇంతవరకు నిందితుల ఆచూకీ లభ్యం కాకపోవడంతో కేసు విచారణలో భాగంగా ఏఎస్పీ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అక్కడ నుంచి స్టేషన్‌కు వచ్చి పలు విషయాలను ఎస్ఐ భీమరాజును అడిగి తెలుసుకున్నారు. నేరం జరిగిన రోజు నుంచి ఇంతవరకు సేకరించిన వివరాలపై ఆరా తీశారు. దర్యాప్తు జరుగుతున్న తీరుపై వివరాలు సేకరించారు.

30, 31 తేదీల్లో బ్యాంక్ ఉద్యోగుల సమ్మె



కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

అనకాపల్లిటౌన్: జాతీయ బ్యాంక్‌లను ప్రైవేటీకరించే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఈనెల 30, 31 తేదీల్లో సమ్మె చేయనున్నట్టు ఉడ్‌పేట యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల సంఘం ప్రతినిధి కాండ్రేగుల హరికృష్ణ తెలిపారు. స్థానిక బ్యాంక్‌లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యోగులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారానికి ఐదు రోజులు పనిదినాలు కల్పించాలని, బ్యాంక్‌ల ప్రైవేటీకరణ విధానాన్ని విరమించుకోవాలని, కొత్త ఫైనాన్స్ విధానాన్ని విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యోగులు హర్షిత్, నాగప్రసన్న, సౌమ్య, శ్రీనివాసరావు, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కేకే లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు


తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): భద్రతాకారణాల దృష్ట్యా కేకే లైన్‌లో నడిచే పలు రైళ్ల గమ్యాన్ని కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ఈనెల 25, 26 తేదీల్లో విశాఖపట్నం-కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 26,27 తేదీల్లో కిరండూల్-విశాఖపట్నం (18513) ఎక్స్‌ప్రెస్ కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుంచి విశాఖపట్నం చేరుకుంటుంది. ఆయా తేదీల్లో దంతేవాడ-కిరండూల్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించవు. అలాగే ఈ నెల 25, 26 తేదీల్లో విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ రైలు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 26, 27 తేదీల్లో కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ రైలు కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ఆయా తేదీలలో ఈ రైళ్లు దంతేవాడ-కిరండూల్ మధ్య రాకపోకలు సాగించవు.

ముంచుకొస్తున్న గడువు

- సెస్సు వసూలుకు రెండు నెలలే సమయం
- వెనుకంజలో మార్కెట్ కమిటీలు



నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ



మార్కెట్ కమిటీలో పసుపు

నర్సీపట్నం: కేంద్రం తీసుకువచ్చిన నూతన చట్టాలతో రెండేళ్ల క్రితం వరకు ఆదాయాన్ని కోల్పోయిన మార్కెట్ కమిటీలు, లోటును భర్తీ చేసే దిశగా వేస్తున్న అడుగులు కుదురుగా పడటం లేదు. జిల్లాలో అన్ని మార్కెట్ కమిటీలు సెస్సు వసూలుకు లక్ష్యాలు నిర్దేశించుకున్నా అనుకున్న స్థాయిలో జరగడం లేదు. మరో రెండు నెలల్లో గడువు ముగియనుంది. ఎంత మేరకు లోటు భర్తీ అవుతుందోనన్న మీమాంసలో అధికారులు ఉన్నారు. గత ఏడాది అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా సెస్సు వసూలు లక్ష్యం రూ.9.16 కోట్లు కాగా, రూ.4.15 కోట్లు మాత్రమే వసూలైంది. ఈ ఏడాది లక్ష్యం రూ.10.20 కోట్లు కాగా ఇప్పటి వరకూ రూ.6.45 కోట్లు వసూలు చేశారు.

మార్కెట్ సెస్సును సాధారణంగా ఎక్కువ మంది ట్రేడర్లు ముందే చెల్లించి పంట ఉత్పత్తుల ఎగుమతులు చేస్తుంటారు. చిన్న చిన్న వ్యాపారులు సరకు తీసుకు వెళ్లేటప్పుడు చెక్ పోస్టుల్లో చెల్లిస్తుంటారు. సెస్సు రూపేణా వచ్చిన ఆదాయంతో మార్కెట్ కమిటీల అధికారులు, సిబ్బంది జీతాలతో పాటు రైతులకు ప్రయోజనం చేకూర్చే కార్యక్రమాలు చేపడతారు. ధాన్యంపై 2 శాతం, చేపలు, రొయ్యల ఉత్పత్తులపై ఒక శాతం వరకూ సెస్సు వసూలు చేస్తున్నారు. అనకాపల్లి జిల్లా నుంచి చేపలు, రొయ్యల ఎగుమతి అంతగా లేదు. ఎక్కువ శాతం ధాన్యం ద్వారానే ఆదాయం వస్తోంది. జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, యలమంచిలి, పాయకరావుపేట, మాడుగుల, చోడవరం కమిటీలున్నాయి. వీటికి అనుబంధంగా 15 వరకు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. ప్రధానంగా నర్సీపట్నం, అనకాపల్లిలలో నిర్దేశించిన లక్ష్యం 50 శాతానికి మించలేదు. అనకాపల్లి మార్కెట్‌కు ప్రధాన ఆదాయ వనరు బెల్లం ఎగుమతుల ద్వారా వస్తుంది. నల్లబెల్లంపై ఎక్సైజ్ అధికారులు ఆంక్షలు విధించడంతో మార్కెట్ ఆదాయానికి గండిపడిందని అధికారులు పేర్కొంటున్నారు. రైతులు చెరకు సాగు విస్తీర్ణం తగ్గించారు. నర్సీపట్నం విషయానికొస్తే ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏజెన్సీలో పండిన ఉత్పత్తులకు వ్యాపారులు ఇక్కడే సెస్సు చెల్లింపులు చేసేవారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో ఈ చెల్లింపులు అల్లూరి జిల్లాలో ఉన్న మార్కెట్ కమిటీలకు చేరుతున్నాయి. ప్రభుత్వం విధించిన లక్ష్యాన్ని చేరుకోడానికి కేవలం రెండు నెలలు మాత్రమే గడువుంది. ఈ సమయంలో లక్ష్యానికి అనుగుణంగా వసూళ్లు పూర్తవుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్ కమిటీల వారీగా సెస్ వసూలు వివరాలు ఇలా ఉన్నాయి

మార్కెట్ కమిటీ	లక్ష్యం రూ.లలో	డిసెంబరు నాటికి వసూలు రూ.లలో
నర్సీపట్నం	2.20 కోట్లు	1.09 కోట్లు
అనకాపల్లి	2.90 కోట్లు	1.1 కోట్లు
యలమంచిలి	1.80 కోట్లు	1.94 కోట్లు
పాయకరావుపేట	1.52 కోట్లు	1.20 కోట్లు
మాడుగుల	51 లక్షలు	15 లక్షలు
చోడవరం	1.27 కోట్లు	71.42 లక్షలు

లక్ష్యాన్ని అధిగమిస్తాం



ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పండగ తర్వాత ధాన్యం క్రయ విక్రయాలు ఊపందుకున్నాయి. ఇప్పటికే యలమంచిలి మార్కెట్‌లో లక్ష్యాన్ని మించి సెస్సు వసూలైంది. ఆదాయాన్ని పెంచుకునేందుకు విజిలెన్స్ టీమ్‌లు ఏర్పాటు చేశాం. 60 శాతం సెస్సు వసూలు చేశాం. మిగిలిన 40 శాతం వసూలుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

– బి.రవి కిరణ్, జిల్లా మార్కెటింగ్ ట్రేడింగ్ ఆఫీసర్

క్షయ రోగులకు పౌష్టికాహారం తప్పనిసరి

- హెటిరో సాయంతో రోగులకు పోషకాహారం పంపిణీ



రోగులకు పౌష్టికాహారం అందిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

అనకాపల్లిటౌన్ : క్షయ వ్యాధిగ్రస్తులు వైద్యుల సూచన మేరకు సకాలంలో మందులు వాడడంతో పాటు, పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో నక్కపల్లి హెటిరో ఫౌండేషన్ ఆర్థిక సాయంతో రోగులకు మంగళవారం పౌష్టిక ఆహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 476 మంది రోగులను హెటిరో ఫౌండేషన్ దత్తత తీసుకుని ఏడాది పాటు వారికి పోషకాహారం అందించనుండటం అభినందనీయమన్నారు. క్షయ రోగులు ప్రభుత్వం అందిస్తున్న మందులను క్రమం తప్పకుండా వాడటంతోపాటు, ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం హెటిరో ఎండీ పుల్లారెడ్డి రూ.20 లక్షల రూపాయల చెక్‌ను రోగుల పౌష్టికాహారం నిమిత్తం కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి అందించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ఎ.హేమంత్, డీసీహెచ్ఎస్ కె.శ్రావణ్‌కుమార్, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్, వైద్యులు, రోగులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో చిరంజీవులు



మొబైల్ వాహనాన్ని ప్రారంభిస్తున్న గోపాల్



చిరుధాన్యాలతో వేసిన ముగ్గు

- ఏపీ నాబార్డ్ సీజీఎం గోపాల్

అనకాపల్లిటౌన్ : చిరుధాన్యాలు పండించే రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని ఏపీ నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం) ఎం.ఆర్.గోపాల్ తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లో మంగళవారం శారదావ్యాలీ డెవలప్‌మెంట్ సమితి ఆధ్వర్యంలో జరిగిన చిరుధాన్యాల సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చిరుధాన్యాలను మన ఆహారంలో భాగంగా చేసుకుంటే అనారోగ్యాలను దూరం చేసుకుని చిరంజీవులుగా జీవించవచ్చన్నారు. చిరుధాన్య పంటలకు ప్రభుత్వం అనేక రాయితీలు కల్పిస్తోందన్నారు. రాయితీలను ప్రతి ఒక్క రైతు సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. చిరుధాన్యాల సాగుతో వచ్చే లాభాలు, మార్కెటింగ్ సదుపాయాలను కూలంకషంగా వివరించారు. చిరుధాన్యాలు పండించే రైతుల వద్దకు బ్యాంకర్లు వచ్చి, రుణాలు అందిస్తారని పేర్కొన్నారు. సదస్సులో ఏర్పాటు చేసిన 9 రకాల స్టాళ్లను ఆయన పరిశీలించారు. అంతకుముందు చిరుధాన్యాలు తినండి చిరంజీవులుగా జీవించండి.. అంటూ వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి నెహ్రూచౌక్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. చిరుధాన్యాల చెల్లెల సంఘం మొబైల్ వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ ఏజీఎం శ్రీనివాస్, ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ జగన్నాథరావు, వ్యవసాయ శాఖ జేడీ ఎ.మోహనరావు, హార్టికల్చర్ జేడీ ప్రభాకర్, సమితి కార్యదర్శి జోగినాయుడు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు శుభవార్త

- పదేళ్ల తరువాత పదోన్నతులు
- ఇద్దరికి కారుణ్య నియామకం కింద శాశ్వత ఉద్యోగాలు
- చైర్‌పర్సన్ కొండా రమాదేవికి ఉద్యోగులు కృతజ్ఞతలు



పదోన్నతులు పొందిన ఉద్యోగులతో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి

దొండపర్తి(విశాఖ దక్షిణ): విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఆ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి శుభవార్త చెప్పారు. దాదాపు పదేళ్ల పాటు పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల సమస్యను పరిష్కరించారు. ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలపై కూడా ఉత్తర్వులు ఇచ్చి ఇద్దరికి శాశ్వత ఉద్యోగాలు కల్పించారు. ఈ సందర్భంగా మంగళవారం రామాటాకీస్ వద్ద గల జిల్లా గ్రంథాలయ సంస్థ కేంద్ర కార్యాలయంలో చైర్‌పర్సన్ రమాదేవి ఉద్యోగులకు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం పదోన్నతి, ఉద్యోగాలు పొందిన వారికి ఆమె శుభాకాంక్షలు తెలిపారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించిన చైర్‌పర్సన్ రమాదేవికి ఉద్యోగులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి(ఎఫ్ఏసీ) లలిత, ఇతర గ్రంథాలయ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

శుభమస్తు

- నేటి నుంచి మార్చి 13 వరకూ ముహూర్తాలు
- శంకుస్థాపనలు, గృహప్రవేశాలకు సిద్ధమవుతున్న జిల్లా వాసులు
- ఫంక్షన్ హాళ్లు, కల్యాణ మండపాలకు డిమాండ్
- జిల్లాలో ఏకం కానున్న వందలాది జంటలు
- అన్ని రంగాలకు చేతినిండా పనే



హంగులతో సిద్ధమైన కల్యాణ వేదిక

అనకాపల్లి రూరల్: పుష్యమాసం ముగిసి మాఘమాసం రావడంతో మళ్లీ శుభముహూర్తాలకు తెరలేచింది. భజంత్రీలు మోగే సమయం ఆసన్నమైంది. ఈ నెల 25 నుంచి మార్చి 13 వరకూ దాదాపు 20కి పైగా ముహూర్తాలున్నాయి. వివాహాలతో పాటు గృహప్రవేశాలు, శంకుస్థాపనలు, నిశ్చయ తాంబూలాలు పుచ్చుకోవడానికి సంబంధిత కుటుంబాల వారు సరంజామా సిద్ధం చేసుకున్నారు. 2022 ద్వితీయార్థంలో శుక్రమౌఢ్యమి, డిసెంబరు నెలలో పుష్యమాసం కావడంతో శుభకార్యాలన్నీ నిలిచిపోయాయి. అన్నింటికీ మాఘమాసం మంచిది కావడంతో ఈ నెలలో ఉన్న శుభ ముహూర్తాల్లో కొత్తజంటలు ఏకం కాబోతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా అంతటా పెళ్లి సందడి నెలకొంది. అనేక వృత్తులపై ఆధారపడిన వారికి ఉపాధి దొరకనుంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 1500కు పైగా వివాహాలు జరుగుతాయని అంచనా.

కల్యాణ మండపాలకు డిమాండ్

చాలా మంది వివాహాలను కల్యాణ మండపాల్లో జరపడానికి ఆసక్తి చూపుతున్నారు. ఆర్థిక స్థితిగతులను బట్టి ఫంక్షన్ హాళ్లను ఎంపిక చేసుకుంటున్నారు. గతంలో సౌకర్యాలున్న మండపాలు అరకొరగా ఉండేవి. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలు, మండల కేంద్రాల్లో కూడా కల్యాణ మండపాలు ఉన్నాయి. నర్సీపట్నం, అనకాపల్లి, చోడవరం, యలమంచిలి, నక్కపల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట మండలాల్లో కూడా అన్ని సదుపాయాలున్న మండపాలు అందుబాటులో ఉన్నాయి. వీటికి డిమాండ్ ఎక్కువగా ఉంది. పుష్పాలంకరణ, లైటింగ్, ఆతిథ్యం, ఇతర హంగుల కోసం రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు.

ఊపందుకుంటున్న వ్యాపారాలు

పెళ్లిళ్లు, శుభకార్యాల ముహూర్తాలతో అన్ని రకాల వ్యాపారాలు ఊపందుకుంటున్నాయి. నగదు, వస్త్ర దుకాణాల్లో సందడి నెలకొంది. ఒక్కో పెళ్లికి కనీసం రూ.లక్ష నుంచి రూ.10 లక్షలు వెచ్చించి దుస్తులు కొనుగోలు చేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. బంగారు నగలు కూడా అదే స్థాయిలో కొనుగోలు చేస్తుండడంతో నగల దుకాణాలు కళకళలాడుతున్నాయి. ప్రతి రోజూ రూ.కోట్లలో వ్యాపారం జరుగుతోంది. విందు భోజనం అంటేనే అన్ని రకాల వంటకాలుండాలి. కిరాణా దుకాణాల్లో సరకుల కొనుగోలు పెరిగింది. పూల దుకాణాలు, డెకరేషన్, పురోహితులు, బ్యాండు పార్టీలు, కేటరింగ్, షామియానా, టెంట్‌హౌస్‌లు, మినరల్ వాటర్ తదితర వ్యాపారులకు ఉపాధి దొరుకుతుంది. వీరు కాకుండా సహాయకులకు, ఇతర రంగాల వారికీ చేతినిండా ఉపాధి లభించనుంది.

మాఘం మహాశ్రేష్ఠం



మాఘమాసం అంటేనే ఎంతో శ్రేష్ఠమైంది. ఈ నెలలో చాలా మంచి ముహూర్తాలున్నాయి. వివాహాలు, నిశ్చితార్థాలు, గృహప్రవేశాలు, శంకుస్థాపనలకు ముహూర్తాలున్నాయి. ఫాల్గుణమాసం వరకూ ఈ శుభముహూర్తాలున్నందున గ్రామాలన్నీ శుభకార్యాలతో కళకళలాడుతుంటాయి. వచ్చే ఏడాది జ్యేష్ఠ మాసం వరకు శుభకార్యాలు జరుగుతూనే ఉంటాయి.

–పెద్దింటి సూర్యనారాయణమూర్తి, పురోహితుడు

డోలీలో మృతదేహం తరలింపు



రవీంద్ర మృతదేహాన్ని డోలీలో తరలిస్తున్న బంధువులు

రావికమతం: మండలంలోని చలిసింగం గ్రామానికి చెందిన కొప్పుల రవీంద్ర(24) అనే యువకుడు అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందగా, అతని మృతదేహాన్ని చీకాయపాడు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న స్వగ్రామానికి డోలీలో తరలించారు. రవీంద్ర కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కొత్తకోట,నర్సీపట్నం ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో బంధువులు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో సోమవారం చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందడంతో అంబులెన్స్‌లో చీకాయపాడు వరకూ మృతదేహాన్ని తరలించి, అక్కడి నుంచి రహదారి సౌకర్యం లేకపోవడంతో డోలీలో స్వగ్రామానికి తరలించారు.

రహదారి సౌకర్యం కల్పించాలి

400 మంది జనాభా ఉన్న చలిసింగం గ్రామానికి రహదారి సౌకర్యం లేదు. మూడు కొండలెక్కి దిగాలి. గతంలో ఘాట్ రోడ్డు వేసేందుకు ప్రతిపాదనలు పంపగా అటవీశాఖ అనుమతులు లేకపోవడంతో కార్యరూపం దాల్చలేదు. దీంతో అత్యవసర సమయాల్లో డోలీమోతలు తప్పడం లేదు. గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని ఆ గ్రామ సర్పంచ్ వంజరి గంగరాజు, గ్రామస్తులు కోరారు.

సర్వాంగ సుందరంగా సరస్వతీ ప్రాంగణాలు

- శరవేగంగా నాడు-నేడు రెండో దశ పనులు
- 595 పాఠశాలల ఎంపిక
- జిల్లాకు రూ.451 కోట్లు విడుదల
- ఆర్థిక భారం లేకుండా రివాల్వింగ్ ఫండ్
- మొదటి విడతలో రూ.103 కోట్లతో 598 పాఠశాలల్లో పనులు

నక్కపల్లి: జిల్లాలో నాడు-నేడు రెండో దశ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో నాడు-నేడు పథకానికి శ్రీకారం చుట్టింది. మొదటి దశ పనులు పూర్తయ్యాయి. రెండో దశ పనులకు సైతం నిధులు విడుదల చేయడంతో పనులు చురుగ్గా జరుగుతున్నాయి. నాడు-నేడు రెండో విడత కింద అనకాపల్లి జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో 24 మండలాల్లో 595 పాఠశాలలను ఎంపిక చేశారు. రూ.451 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. తొలి విడతలో రూ.102 కోట్లతో 598 పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేశారు. రెండో విడతలో మరింత పారదర్శకంగా పనులు చేపట్టేలా జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పనుల విషయంలో పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. అదనపు తరగతి గదుల నిర్మాణం, ఫర్నిచర్, మరుగుదొడ్లు, తాగునీరు, ప్రహరీల నిర్మాణం, విద్యుత్ సదుపాయం, క్రీడా మైదానాల అభివృద్ధి, డైనింగ్ రూములు, కిచెన్‌షెడ్లు, ఆకర్షణీయమైన రంగులు, గోడలపై జాతీయ నాయకుల చిత్రపటాలు, గ్రీన్ చాక్‌బోర్డు, ఆర్‌వో ప్లాంట్ల వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలలు శిథిలావస్థకు చేరి మరమ్మతులు చేపట్టడానికే ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సి వచ్చేది. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ నేలపైనే కూర్చుని పాఠాలు నేర్చుకోవాల్సిన పరిస్థితి ఉండేది.

నియోజకవర్గాల వారీగా ఎంపికైన పాఠశాలలు, విడుదలైన నిధుల వివరాలు

నియోజకవర్గం	ఎంపికైన పాఠశాలలు	విడుదలైన నిధులు
పాయకరావుపేట	128	రూ.109 కోట్లు
యలమంచిలి	107	రూ.80 కోట్లు
మాడుగుల	70	రూ.42 కోట్లు
చోడవరం	81	రూ.73 కోట్లు
నర్సీపట్నం	97	రూ.74 కోట్లు
పెందుర్తి	45	రూ.25 కోట్లు
అనకాపల్లి	67	రూ.40 కోట్లు



మొదటి విడతలో అభివృద్ధి చేసిన డీఎల్‌పురం జెడ్పీ ఉన్నత పాఠశాల



నాడు-నేడు కార్యక్రమంలో అభివృద్ధి చేసిన బంగారమ్మపేట ప్రాథమిక పాఠశాల



రెండో విడత నిధులతో దొండవాకలో అదనపు భవనాలకు శ్లాబ్ వేస్తున్న దృశ్యం

100 మంది విద్యార్థులకు సైతం ఒక్క మరుగుదొడ్డి కూడా లేని పరిస్థితులు ఉండేవి. మరుగు కోసం విద్యార్థులు నరకయాతన పడేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. విద్యార్థుల భవిష్యత్ అవసరాలను తీర్చేలా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తల్లిదండ్రులను భాగస్వామ్యం చేసి వారి పర్యవేక్షణలోనే ఈ పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టింది. ఇంజినీరింగ్ సిబ్బంది, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి పాఠశాలల్లో అవసరమైన పనులను గుర్తించారు. ఈ పనులు చేపట్టేందుకు ఆర్థిక భారం లేకుండా ముందస్తు పెట్టుబడి (రివాల్వింగ్ ఫండ్) ఇప్పటికే ఎస్ఎంసీ ఖాతాల్లో జమ చేస్తోంది. పనులు పూర్తయ్యే వరకు విడతల వారీగా ఈ రివాల్వింగ్ ఫండ్ విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

రాజీ పడే ప్రసక్తే లేదు



నాడు-నేడు పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. పాఠశాలల్లో రెండో దశ పనులు ప్రారంభమయ్యాయి. నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. సకాలంలో పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశాం. హెచ్ఎంలతో పాటు, ఎస్ఎంసీ సభ్యులు కూడా పనులను పర్యవేక్షించాలి. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తాం.

– బి.లింగేశ్వరరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి, అనకాపల్లి.

క్లుప్తంగా

స్కూటీలో గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

నర్సీపట్నం : స్కూటీలో గంజాయి తీసుకువెళ్తున్న వ్యక్తిని టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. టౌన్ ఎస్ఐ ధనుంజనాయుడు అందించిన వివరాలు..సిబ్బందితో కలిసి ఈ నెల 23వ తేదీ రాత్రి డిగ్రీ కళాశాల మెయిన్ రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. నర్సీపట్నం వస్తున్న స్కూటీని ఆపి తనిఖీ చేయగా 2 కిలోల గంజాయి లభ్యమైంది. గంజాయి, స్కూటీని స్వాధీనం చేసుకుని, గంజాయి తీసుకువెళ్తున్న రోలుగుంట మండలం, బుచ్చంపేటకు చెందిన సుర్ల అర్జున్(30)ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయి రోలుగుంట నుంచి తుని తీసుకువెళ్తున్నట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది.

30 లీటర్ల సారా స్వాధీనం

మాకవరపాలెం : విక్రయించేందుకు సిద్ధం చేసిన 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. మండలంలోని తూటిపాల, అడిగర్లపాలెం ప్రాంతాల్లో సారా విక్రయాలు చేస్తున్నట్టు అందిన సమాచారంతో మంగళవారం దాడులు చేశామన్నారు. ఈ దాడిలో 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మాకవరపాలెం: పేకాట ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. తూటిపాల శివారులో మంగళవారం పేకాటాడుతున్నట్టు సమాచారం రావడంతో దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.1,400 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

నేడు చోడవరం, నర్సీపట్నాలలో వైఎస్సార్‌సీపీ సమావేశాలు

- హాజరుకానున్న పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి


ప్రభుత్వ విప్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ

చోడవరం: రానున్న ఎన్నికల్లో విజయం సాధించే దిశగా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసేందుకు ఈనెల 25న నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్టు ప్రభుత్వ విప్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ మంగళవారం చెప్పారు. చోడవరం, నర్సీపట్నం నియోజకవర్గాల్లో జరిగే ఈ సమావేశాలకు వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, తిరుమల,తిరుపతి దేవస్థానం చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి హాజరుకానున్నారని ఆయన చెప్పారు. చోడవరం నియోజకవర్గస్థాయి సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు చోడవరంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. నర్సీపట్నం నియోజకవర్గ స్థాయి సమావేశం పెదబొడ్డేపల్లిలోని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కార్యాలయంలో మధ్యాహ్నం 3గంటలకు జరుగుతుందన్నారు. ఈ సమావేశాలకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, వివిధ పదవుల్లో ఉన్న ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ధర్మశ్రీ కోరారు.

వరలక్ష్మి హత్యకేసులో ఒడిశాకు నిందితుడు

కశింకోట : మండలంలోని కొత్తపల్లికి చెందిన ఆకురాతి వరలక్ష్మి హత్య కేసులో లొంగిపోయిన నిందితుడిని ఒడిశా పోలీసులకు అనకాపల్లి పట్టణ పోలీసులు అప్పగించారు. ఈ నెల 21న వరలక్ష్మిని ఒడిశా-ఆంధ్ర సరిహద్దుకు తీసుకెళ్లి హత్య చేసినట్టు అనకాపల్లి మండలం చిన మాకవరం గ్రామానికి చెందిన వ్యక్తి అనకాపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒడిశా రాష్ట్రంలోని చిత్రకొండ పోలీసులు అనకాపల్లి పోలీసు స్టేషన్‌కు వచ్చి విచారించి సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత నిందితుడిని తమ వెంట తీసుకుపోయినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని చిత్రకొండ పోలీస్ స్టేషన్‌లో విచారిస్తున్నట్లు సమాచారం. ఈ సంఘటనలో హతురాలి మృతదేహాన్ని ఒడిశాలోని మల్కన్‌గిరిలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. దీంతో ఇక్కడి నుంచి కుటుంబ సభ్యులు వెళ్లి మంగళవారం రాత్రి పొద్దుపోయాక వరలక్ష్మి మృతదేహాన్ని తీసుకు వచ్చినట్లు ఆమె సోదరుడు సురేష్ తెలిపారు. మృతురాలి రక్త నమూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించి, కేసు నమోదు చేసి చిత్రకొండ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అట్రాసిటీ కేసులో ఒకరి అరెస్టు

నర్సీపట్నం : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఓ వ్యక్తిని నర్సీపట్నం టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. టౌన్ సీఐ ఎన్.గణేష్ అందించిన వివరాలివి. మున్సిపాలిటీ అయ్యన్న కాలనీలో నివాసం ఉంటున్న గిరిజన మహిళతో బీసీ కాలనీకి చెందిన ఎ. దుర్గా సంతోష్ రెండేళ్లుగా వివాహితర సంబంధం కలిగి ఉన్నాడు.

పెళ్లి చేసుకునేందుకు దుర్గా సంతోష్ నిరాకరించడంతో బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ స్వయంగా విచారణ చేశారు. దుర్గా సంతోష్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

క్రికెట్ టోర్నీ నిర్వహణ అభినందనీయం

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- 'సాక్షి'ప్రీమియర్ లీగ్ పోటీలు ప్రారంభం


బంతిని బలంగా కొడుతున్న బ్యాటర్


టోర్నీ ప్రారంభమ్యాచ్‌లో తలపడిన జట్లతో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి

విశాఖ స్పోర్ట్స్: యువతను ప్రోత్సహించేందుకు 'సాక్షి' మీడియా ఏటా క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానంలో 'సాక్షి'ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఇదొక మంచి వేదిక అని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి.. ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. 'సాక్షి'బ్యూరో చీఫ్ రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ ఆటగాళ్లకు ఫిట్‌నెస్ ముఖ్యమన్నారు. క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. సర్క్యులేషన్ ఏజీఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏటా క్రికెట్ పోటీలతో పాటు సామాజిక బాధ్యతగా పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం మేయర్ కాసేపు బ్యాటింగ్ చేసి ఆటగాళ్లలో ఉత్సాహం నింపారు. టాస్ వేసి పోటీలను ప్రారంభించి.. ప్రారంభ పోటీలో పాల్గొన్న ఇరు జట్లను పరిచయం చేసుకున్నారు. ఈ పోటీలకు సీఎంఆర్ షాపింగ్‌మాల్ డిస్ట్రిక్ట్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది.

SAKSHI SAKSHI DIGITAL MEDIA GROUP | SPL SAKSHI PREMIER LEAGUE

తొలి రోజు విజేతలు వీరే..

సాక్షి ప్రీమియర్ లీగ్(ఎస్పీఎల్) జూనియర్స్ విభాగం ప్రారంభ మ్యాచ్‌లో శ్రీకశ్యప్ జూనియర్ కళాశాల జట్టు 20 పరుగుల తేడాతో ఆళ్వార్‌దాస్ పాలిటెక్నిక్ జట్టుపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కశ్యప్ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 92 పరుగులు చేసింది. భరత్ 23, ఆర్.దుర్గాప్రసాద్ 22 పరుగులు చేశారు. విష్ణు రెండు వికెట్లు తీశాడు. ప్రతిగా ఆళ్వార్‌దాస్ జట్టు ఐదు వికెట్లు కోల్పోయి 72 పరుగులే చేసింది. బాలచంద్ర 27 పరుగులు చేశాడు.

- మరో మ్యాచ్‌లో ఎస్‌వీఎల్‌ఎన్‌ఎస్‌వీపీ(గోపాలపట్నం) కళాశాల జట్టు 18 పరుగుల తేడాతో ఏవీఎన్ పాలిటెక్నిక్ జట్టుపై విజయం సాధించింది. ఎస్‌వీఎల్‌ఎన్‌ఎస్‌వీపీ 75 పరుగులకు ఆలౌటైంది. ప్రతిగా ఏవీఎన్ పాలిటెక్నిక్ 57 పరుగులకే ఇన్నింగ్స్ ముగించింది. మురళీ రెండు, సల్మాన్ మూడు వికెట్లు తీశారు.
- తొలి రోజు చివరి మ్యాచ్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్(కంచరపాలెం) జట్టు ఏడు వికెట్ల తేడాతో వీఎస్ కృష్ణా కళాశాల జట్టుపై విజయం సాధించింది. వీఎస్ కృష్ణా కళాశాల ఏడు వికెట్లు కోల్పోయి 73 పరుగులు చేసింది. సురేష్ 30 పరుగులు చేశాడు. రిషి రెండు వికెట్లు తీశాడు. ప్రతిగా ప్రభుత్వ పాలిటెక్నిక్ జట్టు మూడు వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. సాయిగణేష్ 40 పరుగులు చేశాడు.

District sponsor
CMR SHOPPING MALL The joy of life ANDHRAPRADESH | TELANGANA


విజేతలు వీరే.. శ్రీకశ్యప్ కళాశాల జట్టు


ఎస్‌వీఎల్‌ఎన్ ఎస్‌వీపీ కళాశాల జట్టు


కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టు

నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నియంత్రణ


హెల్మెట్ పెట్టుకున్న వాహన చోదకులకు పూలు అందించి అభినందిస్తున్న సీఐ రవికుమార్

కశింకోట : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అనకాపల్లి రూరల్ సీఐ ఎ.రవికుమార్ కోరారు. మండలంలోని తాళ్లపాలెం కూడలిలో మంగళవారం రామ్‌కో సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో రహదారి భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహన చోదకుడు ప్రమాదాల నివారణకు, తమ భద్రతకు హెల్మెట్ ధరించాలన్నారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించిన వాహన చోదకులకు పుష్పగుచ్ఛాలు, పువ్వులు అందించి అభినందించారు. రహదారి భద్రతా నియమాలపై అవగాహన కలిగిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి, పరిశ్రమ హెడ్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యంపై ఫిర్యాదు


ఆర్.చాణక్య(ఫైల్)

కె.కోటపాడు : మేడిచర్లకు చెందిన రొంగలి చాణక్య(13) సోమవారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని తండ్రి చిన్నంనాయుడు ఎ.కోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ బి.రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు... మేడిచర్లకు చెందిన చాణక్య కె.కోటపాడు ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన చాణక్య మధ్యాహ్నం 3 గంటలకే ఇంటికి చేరుకొని, అప్పటి నుంచి కనిపించడం లేదని తండ్రి చిన్నంనాయుడు ఫిర్యాదు చేశాడు. విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు చేసి గాలిస్తున్నట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

సీఐ ఆకస్మిక తనిఖీలు


వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలిస్తున్న సీఐ రమణయ్య

రోలుగుంట: స్థానిక పోలీస్ స్టేషన్‌ను నర్సీపట్నం రూరల్ సీఐ పి.రమణయ్య మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఇప్పటి వరకూ వివిధ కేసుల్లో పట్టుబడి, స్వాధీనం చేసుకున్న గంజాయి, మొబైల్స్, సీజ్ చేసిన వాహనాలు తదితర ప్రోపర్టీని తనిఖీ చేశారు. రికార్డులతో సరిపోల్చారు. సిబ్బంది విధులపై ఆరా తీశారు. తరువాత కేసుల నమోదు, నేరాల విచారణపై ఎస్సై బి.నాగకార్తీక్‌కి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ గౌతమీ సాలి ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్టు పేర్కొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణ యోచన విరమించుకోవాలి


సంఘీభావ దీక్షలో సీపీఐ, కాంగ్రెస్ నాయకులు

నర్సీపట్నం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ నెల 30న కార్మిక మహా గర్జనకు మద్దతుగా స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు సంఘీభావ దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు మీసాల సుబ్బన్న, పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. బాలేపల్లి మాట్లాడుతూ విశాఖ ఉక్కును ఆంధ్రుల హక్కు అన్న విషయాన్ని కేంద్రం మరిచిపోకూడదన్నారు. ప్రజా సంఘాలు, స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు కొన్ని నెలల తరబడి అలుపెరగని పోరాటాలు చేస్తున్నా కేంద్రం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. కేంద్రం దిగిరాకుంటే ఆందోళను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎం.రామునాయుడు, రాజాన దొరబాబు, ఎల్.వి.రమణ, జి.గురుబాబు, సన్యాసిరావు, అప్పలరాజు, శివలంక కొండలరావు, సుబ్బలక్ష్మి, జి.రాధాకృష్ణ, శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాలలో పార్కు ఏర్పాటుకు స్థల పరిశీలన

అనకాపల్లి రూరల్: తుమ్మపాల సమీపంలో బొజ్జన్న కొండకు వెళ్లే రహదారిలో పార్కు ఏర్పాటుకు జిల్లా పంచాయతీ అధికారిణి ఆర్. శిరీషారాణి మంగళవారం స్థల పరిశీలన చేశారు. గ్రామానికి సమీపంలో పార్కు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించినట్టు ఆమె తెలిపారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు,పంచాయతీ వార్డు సభ్యులతో మాట్లాడారు.సమీపంలో ఉన్న ఏలేరు కాలువపై ప్రస్తుతం ఉన్న వంతెన చిన్నదిగా ఉండడంతో రాకపోకలు ఇబ్బందిగా ఉన్నట్టు స్థానిక ప్రజాప్రతినిధులు డీపీవో దృష్టికి తెచ్చారు.కాస్త పెద్ద వంతెన నిర్మిస్తే అనకాపల్లి పట్టణానికి రహదారి కనెక్టివిటీ బాగుంటుందని సర్పంచ్ ఆమెకు తెలిపారు. ఏలేరు కాల్వ సమీపంలో రహదారిని ఆనుకుని ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే రాకపోకలకు సురక్షితంగా ఉంటుందని తెలిపారు.తుమ్మపాల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు,స్కూల్ కమిటీ ఛైర్మన్ గొంతిన శ్రీను, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లి మందలించిందని కుమారుడు ఆత్మహత్య

అనకాపల్లిటౌన్ : మండలంలోని బవులవాడ పంచాయతీ ఆర్‌వీఎస్ నగర్‌కు చెందిన ఎం.దేముడు (17) మంగళవారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామీణ ఎస్ఐ నర్సింగరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. పాడేరులో ఉన్న మేనమామ దగ్గరకు వెళ్తానని తల్లి వెంకటలక్ష్మిని దేముడు అడగ్గా ఆమె మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన దేముడు, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కూలి పనులు చేసుకుంటూ కుటుంబానికి చేదోడుగా ఉన్న కొడుకు మరణంతో ఆ తల్లి కన్నీమున్నీరుగా విలపిస్తోంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ప్రజా గర్జనకు మంత్రి అమర్‌నాథ్‌కు ఆహ్వానం

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా అడ్డుకునేందుకు చేస్తున్న పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొని, మద్దతు తెలపాలని రాష్ట్ర ఐటీ, భారీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, అఖిల పక్షాల కార్మిక సంఘాల నాయకులు కోరారు. మిందిలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన్ను కలిసి, మాట్లాడారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఈ నెల 30న ఉక్కునగరంలోని తృష్ణా మైదానంలో నిర్వహించ తలపెట్టిన ప్రజాగర్జన కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్, ఆదినారాయణ, బొడ్డు పైడిరాజు, కారు రమణ, వి. శ్రీనివాసరావు, నీరుకొండ రామచంద్రరావు, గొందేశి ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

కలెక్టర్ మల్లికార్జునకు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు

మహారాణిపేట: ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఉత్తమ విధానాలు అవలంబించిన కలెక్టర్ ఎ.మల్లికార్జున బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డుకు ఎంపికయ్యారు. విజయవాడలో బుధవారం జరగనున్న కార్యక్రమంలో గవర్నర్ చేతులమీదుగా ఆయన అవార్డు స్వీకరించనున్నారు. గాజువాక ఎన్నికల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి ఉత్తమ ఎన్నికల నమోదు అధికారిగా, గాజువాక 159 బూత్ లెవల్ అధికారి సునీత ఉత్తమ బూత్ లెవల్ అధికారిగా అవార్డులు స్వీకరించనున్నారు. జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, సమాచార శాఖ డీడీ వి.మణిరామ్, కలెక్టరేట్ ఎన్నికల సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది మంగళవారం కలెక్టర్ ఎ.మల్లికార్జునను ఆయన చాంబర్‌లో కలిసి అభినందనలు తెలిపారు.

బస్సు ఎక్కుతూ జారి పడి ఒకరి మృతి


బస్సు టైరు కింద శ్రీనివాసరావు మృతదేహం

అనకాపల్లిటౌన్ : స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో కదులుతున్న విజయనగరం బస్ ఎక్కుతూ ప్రమాదవశాత్తూ కాలుజారి బస్ వెనుక టైర్ కిందపడి విజయనగరానికి చెందిన మైచర్ల శ్రీనివాసరావు(47) అక్కడిక్కడే మృతి చెందాడు. ట్రాఫిక్ ఎస్ఐ జె.రమేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విజయగరం పట్టణం అగ్రహారం బీసీ కాలనీకి చెందిన మైచర్ల శ్రీనివాసరావు సోమవారం అనకాపల్లి జిల్లా యలమంచిలి అక్క ఇంటికి నల్లమారమ్మతల్లి పండగకు వచ్చారు. తిరిగి మంగళవారం ఉదయాన్నే యలమంచిలి నుంచి విజయనగరం వెళ్లేందుకు అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చాడు. అనకాపల్లి నుంచి విజయనగరం వెళుతున్న బస్సు ఎక్కుతూ ప్రమాదవశాత్తూ కాలు జారి బస్సు టైరు కిందపడి మృతి చెందాడు. ఈ ఘటనపై శ్రీనివాసరావు భార్య ఇందిర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. మృతునికి డిగ్రీ చదువుతున్న కుమార్తె ఉన్నట్టు తెలిపారు.

ఘనంగా తీర్థ మహోత్సవం


విజేతలకు బహుమతి అందిస్తున్న అచ్చింనాయుడు, నిర్వాహకులు


కె.కోటపాడు : చౌడువాడలో శ్రీసీతారామాంజనేయ తీర్థం సందర్భంగా నిర్వాహకులు జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పందాలు మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లావ్యాప్తంగా 26 ప్రాంతాల నుండి ఎడ్లను వాటి యజమానులు తీసుకువచ్చారు. నిర్వాహకులు నిర్దేశించిన గమ్యాన్ని తక్కువ కాలవ్యవధిలో చేరుకున్న యడ్ల యజమానులకు నగదు పురస్కారాన్ని అందించారు. ఈ పందాల్లో నీలకంఠాపురానికి చెందిన మహేష్ ఎడ్లు ప్రథమ స్థానంలో, వాయిల్పాడుకు చెందిన వెంకటరావు ఎడ్లు ద్వితీయ స్థానంలో, చుక్కపల్లికి చెందిన పాలవెల్లికి చెందిన ఎడ్లు తృతీయ స్థానంలో నెగ్గాయి. తర్వాతి స్థానాల్లో వరుసగా నరసాపురానికి చెందిన సంపత్ వినాయక గ్రూపు ఎడ్లు, బోయపాడుకు చెందిన దుర్గాప్రసాద్‌కు చెందిన ఎడ్లు, వల్లంపూడికి చెందిన సత్తిబాబుకు చెందిన ఎడ్లు, నర్సయ్యపేటకు చెందిన మోక్షితకు చెందిన ఎడ్లు, సింహాద్రిపురానికి చెందిన వెంకటరమణ ఎడ్లు, దేవరాపల్లికి చెందిన జైవీరాంజనేయ ఎడ్లు, సింగరానికి చెందిన వీరసత్యానికి చెందిన ఎడ్లు, నర్సయ్యపేటకు చెందిన రామకృష్ణ ఎడ్లు నిలిచాయి. వీరికి నిర్వాహకులతో పాటు డేన్ వుడ్ ఫౌండేషన్ చైర్మన్ దొగ్గ అచ్చింనాయుడు నగదు బహుమతిని ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, సర్పంచ్ ఎరుకునాయుడు, రాజి శ్రీనివాసరావు, సుందరపు గంగాధర్, ఆకుల సాయిప్రసాద్, చల్లా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రయ్యపేటలో..

మండలంలో చంద్రయ్యపేటలో మల్లికార్జునస్వామి తీర్థమహోత్సవం ప్రజలు వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మహిళను బెదిరించిన ఇద్దరిపై కేసు నమోదు

- బాధితురాలి పెంపుడు కుక్కను కొట్టి చంపిన నిందితుడు


రక్తపు మడుగులో చనిపోయి పడి ఉన్న నాగమణి పెంపుడు కుక్క

చోడవరం : తన ఇంటిపైకి వచ్చి తనను దుర్భాషలాడి చంపుతానని బెదిరించారంటూ ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేశామని ఎస్ఐ అప్పలనాయుడు చెప్పారు. తిమ్మన్నపాలెం గ్రామానికి చెందిన బొడ్డు నాగమణి ఇంటిపైకి అదే గ్రామానికి చెందిన ఒబలరెడ్డి ఎర్రయ్యమ్మ, ఒబలరెడ్డి రామకృష్ణ తరుచూ వెళ్లి గొడవ చేస్తున్నట్టు బాధితురాలు ఫిర్యాదు చేశారని ఎస్ఐ చెప్పారు. తరుచూ గొడవ చేసే వీరు సోమవారం రాత్రి కూడా నాగమణి ఇంటిపైకి వెళ్లి దుర్భాషలాడడంతో పాటు నాగమణి పెంపుడు కుక్కను కర్రతో కొట్టి రామకృష్ణ చంపాడని, గొడవ జరుగుతున్న సమయంలో రామకృష్ణపైకి నాగమణి పెంపుడు కుక్క అరుస్తూ రావడంతో ఆగ్రహించిన రామకృష్ణ కర్రతో కొట్టి కుక్కను చంపేశాడు. అంతటితో ఆగకుండా కుక్కకు పట్టిన గతే నీకు కూడా పడుతుందని నాగమణిని బెదిరించాడు. దీనిపై ఆమె ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

బాలికలకు అపార అవకాశాలు


మాట్లాడుతున్న అనకాపల్లి ఎస్పీ గౌతమి సాలి

సబ్బవరం: బాలికలు ఏ విషయంలోనూ బాలుర కంటే తక్కువ కాదని .. ఆకాశమే హద్దుగా రాణించాలని అనకాపల్లి ఎస్పీ గౌతమి సాలి అన్నారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ చైల్డ్ అండ్ లా ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డాక్టర్ ఎస్. సూర్యప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఉన్నత స్థితిలో ఉన్న స్త్రీలను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. నేటి పరిస్థితుల్లో బాలికలు,స్త్రీలు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు,బాలికల రక్షణ కోసం దిశ చట్టం తీసుకువచ్చిందన్నారు. దిశ యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకోని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏ పరిస్థితుల్లోనైనా అభద్రతగా అనిపించినపుడు దిశ యాప్‌లో ఫిర్యాదు చేస్తే అతితక్కువ సమయంలో పోలీసుల సహాయం పొందవచ్చన్నారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆమె సమాధానం ఇచ్చారు. వర్సిటీ కులపతి సూర్యప్రకాష్ మాట్లాడుతూ బాలికల రక్షణ మనందరి బాధ్యత కావాలని సూచించారు.

క్లుప్తంగా

ఆలయ ప్రారంభోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



అమ్మవార్ల ఆలయ ప్రారంభోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్ : యువతలో దైవ భక్తిని పెంచితే ప్రశాంతమైన, ఉత్తమ సమాజానికి కృషి చేసినట్టేనని ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. స్థానిక ఎంపీ కార్యాలయంలో మాడుగుల మండలం కేజే పురం శ్రీ మహాలక్ష్మి తల్లి–ఎరుకమ్మ తల్లి అమ్మవార్ల నూతన ఆలయ ప్రారంభోత్సవ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 26న అమ్మవార్ల పాదుకల ఊరేగింపు కార్యక్రమానికి వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కమిటీ సభ్యులను కోరారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, ఎడ్ల పందాలు, రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పి.ఉమామహేష్, జె.జశ్వంత్, చైతన్య. కె.తారక్ తదితరులు పాల్గొన్నారు.

జూదంలో ఒకరి అరెస్ట్

కశింకోట : మండలంలోని సుందరయ్యపేట శివారులో మంగళవారం బల్లాట ఆడుతున్న గుడబండి రాజును పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఎ. ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రాజు నుంచి రూ.1,170 నగదు స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు.

అన్ని రంగాల్లో మహిళల రాణింపు

అనకాపల్లిటౌన్ : స్థానిక వేల్పులవీధి పట్టణ బాలికోన్నత పాఠశాల ఆవరణలో జాతీయ గర్ల్ చైల్డ్ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో పాల్గొన్న హెచ్‌ఎం రుధిరారాణి మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా ఆడ, మగ భేదం లేకుండా పిల్లల్ని సమానంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు రగ్గుల పంపిణీ

మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేటలోని దళితవాడలో మంగళవారం రాత్రి పేదలకు రగ్గుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అచ్యుతాపురంలోని సుందర అల్లాయిస్ పరిశ్రమ సహకారంతో తిమ్మరాజుపేట సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

అనకాపల్లి సినిమాలు

ధమాకా	- రాజా
వాల్తేరు వీరయ్య	- సత్యనారాయణ స్క్రీన్-1
వీర సింహారెడ్డి	- సత్యనారాయణస్క్రీన్-2
18 పేజెస్	- షిర్డిసాయి
వారసుడు	- పర్తిసాయి
వీర సింహారెడ్డి	- వెంకటేశ్వర
వారసుడు	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 4,804 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,500	4,150
మొదటి రకం	3,150	3,480
రెండో రకం	2,870	3,260
మూడో రకం	2,760	2,850

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 56 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13 యూనిట్లు, ఏ నెగిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-2 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-35 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్ బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9182834480)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 423 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 356 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (9441108144)ని సంప్రదించవచ్చు.

సూర్యనారాయణా.. వేదపారాయణా..



సూర్యనారాయణస్వామి



కొండపైనున్న స్వామివారి ఆలయం



ఆంజనేయస్వామి భారీ విగ్రహం

శ్రీ సూర్యనారాయణా, వేద పారాయణా, లోక రక్షామణీ, దైవచూడామణీ అంటూ ప్రత్యక్ష నారాయణుడికి ప్రత్యేక పూజలు జరిపేందుకు సూర్యదేవాలయాలు ముస్తాబయ్యాయి. ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్ అన్నారు పెద్దలు. ఉదయ భానుడి కిరణాలు సోకితే ఆరోగ్యంగా, హాయిగా జీవిస్తామని వైద్యులు కూడా చెప్తుంటారు. అందుకే నమస్కార ప్రియో భానుః అని ప్రతీతి. ఆ కర్మసాక్షిని మనసారా కొలిచేందుకు రథసప్తమి వేడుకలకు పట్టణంలోని సూర్యదేవాలయాల్లో ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి.

- రథసప్తమి వేడుకలకు సిద్ధమైన బ్రహ్మాద్రి
- రేపు స్వామి కల్యాణోత్సవం, సారె ఊరేగింపు

అనకాపల్లిటౌన్ : ప్రత్యక్ష దైవంగా, కోర్కెలు తీర్చే వేల్పుగా, ఆరోగ్యప్రదాతగా భక్తులతో నిత్యం పూజలందుకుంటున్న రాజుపాలెం బ్రహ్మాద్రిపై వెలసిన సూర్యనారాయణస్వామి ఆలయం రథసప్తమి వేడుకలకు సిద్ధమయింది. ఈ నెల 28న రథసప్తమి సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆ రోజు స్వామిని దర్శించుకునేందుకు, మొక్కులు చెల్లించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానుండటంతో నిర్వాహకులు సన్నాహాల్లో మునిగితేలుతున్నారు.

కరోనా భయంతో గతేడాది..

కరోనా నిబంధనల మేరకు గత ఏడాది వేడుకలను పరిమితం చేశారు. దీంతో భక్తులు కూడా భారీగా తరలిరాని పరిస్థితి. ఈ ఏడాది మాత్రం కరోనా భయం వీడటంతో భారీ స్థాయిలో వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొణతాల బాబూరావు, ఆలయ సభ్యులు స్పష్టం చేశారు. వేడుకల్లో భాగంగా ఈ నెల 26న స్వామివారి కల్యాణోత్సవంతోపాటు, అదే రోజు సాయంత్రం సారె ఊరేగింపు నేత్రపర్వంగా సాగనుంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నట్టు ఆలయ కమిటీ పేర్కొంది. సుంకరమెట్ట కూడలిలోని సత్యనారాయణస్వామి ఆలయంలో కొలువైన సూర్యనారాయణుడి వద్ద కూడా రథసప్తమి వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

మూడు దశాబ్దాలుగా..

బ్రహ్మాద్రిగా పిలిచే రాజుపాలెం కొండపై మూడు దశాబ్దాల క్రితం సూర్యభగవానుని శిలావిగ్రహం లభించింది. రథోత్సవం రోజున స్వామివారిని ఊరేగించి అనంతరం ఉప్పునూతిలో ఉంచేవారు. ప్రస్తుతం జీవీఎంసీ విలీన గ్రామమైన 80వ వార్డు పరిధిలోకి చేరిన సూర్యనారాయణస్వామి ఆలయ సర్వాంగసుందరంగా రూపుదిద్దుకుంది. యాగశాల, ఆంజనేయస్వామి ఆలయం, అక్షర నిలయం, అఖండ దీపలక్ష్మి నిలయాలను నిర్మించారు. భక్తులు కొండపైకి చేరుకునేందుకు మెట్లమార్గంతోపాటు, వాహనాలు కొండపైకి వెళ్లేలా ప్రత్యేక రహదారి ఉంది.

భారీ స్థాయిలో సాంస్కృతిక కార్యక్రమాలు

ఉత్సవం సందర్భంగా తెల్లవారుజాము నుంచి స్వామివారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తుతారు. మరోవైపు ఉదయం నుంచే ఆలయం వద్ద కోలాటాలు, భజనలు కొనసాగుతాయి. కొండ దిగువన పలు జానపద వేషాలతోపాటు బాణసంచా విన్యాసాలు, డప్పువాయిద్యాలు, కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉత్సవం రోజు ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ఆలయాన్ని చేరుకునేందుకు కేఎస్ఆర్ పేట రహదారిని ఎక్కువగా వినియోగిస్తారు. తాడి నుంచి ఒక మార్గం, మునగపాక మండలం సిరసపల్లి నుంచి వల్లూరు మీదుగా మరోమార్గం అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే ఆలయ పరిసరాల్లో జరుగుతున్న ఏర్పాట్లను గ్రామీణ సీఐ రవికుమార్ పర్యవేక్షణలో ఎస్‌ఐ సీహెచ్ నర్సింగరావు పరిశీలించారు.

నేడు గవరపాలెం గౌరీపరమేశ్వరుల కల్యాణం

- పురవీధుల్లో భారీ సారె ఊరేగింపు
- 28న అమ్మవారి వార్షిక మహోత్సవం



విద్యుత్ అలంకరణతో ముస్తాబైన ఆలయం

అనకాపల్లిటౌన్ : గవరపాలెం గౌరీపరమేశ్వరుల మహోత్సవాన్ని పురస్కరించుకుని గౌరీపరమేశ్వరుల వార్షిక కల్యాణం బుధవారం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు మంగళవారం తెలిపారు. కల్యాణం అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు అమ్మవారి సారె ఊరేగింపు ఉంటుందన్నారు. సారె ఊరేగింపు గవరపాలెం సతకంపట్టు నుంచి మునసబుగారివీధి, చినరామస్వామికోవెల, విజ్ఞానసమితి, పెదరామస్వామికోవెల, కొణతాల సుబ్రహ్మణ్యంగారివీధి, దిబ్బవీధి, అగ్గిమర్రిచెట్టు, వేగివీధి, చింతావారివీధి, మెయిన్‌రోడ్డు, గౌరీగ్రంథాయం రహదారి మీదుగా గౌరమ్మ గుడికు చేరుకుంటుందన్నారు. మహిళలు తయారుచేసిన పిండి వంటకాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి, ఆలయానికి వచ్చే భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ నెల 28న అమ్మవారి వార్షిక మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వివేకానందుని ఆశయాలు యువతకు ఆదర్శం

- వివేకానందుని విగ్రహావిష్కరణలో మంత్రి గుడివాడ



వివేకానందుని విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్

కశింకోట : స్వామి వివేకానంద ఆశయాలు నేటి యువతకు ఎంతో ఆదర్శనీయమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సూచించారు. కశింకోట పంచాయతీ కార్యాలయం వద్ద ప్రధాన రహదారిపై మాజీ ఉప సర్పంచ్ దివంగత వి.రామప్రసాద్, విశాలాక్షి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమార్తె హారిక నూతనంగా ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించి, పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశాల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పి, దేశ ప్రతిష్టతను ఇనుమడింపజేసిన మహనీయుడు స్వామి వివేకానందుడని కొనియాడారు. దివంగత రామప్రసాద్ సేవలు ప్రశంసనీయమని, వారి కుటుంబం వివేకానందుని విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ముందుగా రామప్రసాద్, విశాలాక్షి దంపతుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి మంత్రి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, విశ్రాంత హెచ్‌ఎం వేదుల వెంకటశాస్త్రి, రామప్రసాద్ కుటుంబ సభ్యులు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఔదార్యం



రక్త దానం చేస్తున్న మహిళా పోలీస్ దివ్యవాణి

అరిలోవ: అత్యవసర పరిస్థితిలో ఓ యువతికి రక్తం అందించి నగర పోలీసులు తమ ఔదార్యం చాటుకున్నారు. అనకాపల్లి జిల్లా మెల్లిపాక గ్రామానికి చెందిన సీహెచ్ సాయి అనే 19 ఏళ్ల యువతి అప్లాస్టిక్ అనీమియా అనే సమస్యతో బాధపడుతోంది. ఆమె తల్లిదండ్రులు వైద్యం కోసం ఆరిలోవ హెల్త్ సిటీలోని పినాకిల్ ఆస్పత్రిలో చేర్చారు. ఆమె చికిత్సకు రక్తం అవసరమని వైద్యులు నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న నగర పోలీసులు రక్తదానానికి ముందుకొచ్చారు. సైబర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు జి.సత్యనారాయణ, కె.నాగేశ్వరరావు, కె.దివ్యవాణితో పాటు విశ్రాంత హెచ్‌సీ జె.శ్రీనివాసరావు రక్తదానం చేసి ఆ యువతికి అందించారు. దీంతో యువతి తల్లిదండ్రులు నగర పోలీసులు చేసిన నిస్వార్థ సేవలకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనకాపల్లిటౌన్ : తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి, నూతన స్తంభం ఏర్పాటు చేయడంలో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ స్థానిక ఈఈ ఎస్.రమణమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని లక్ష్మీనారాయణనగర్ ఫీడర్, కోట్నీవీధి, కరణాలవీధి, బొగ్గారపువారి వీధి, పెరుగులబజారు కూడలి, చిన్నవీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ అసౌకర్యానికి ఆయా ప్రాంతాల ప్రజలు ముందుగానే తమ కార్యకలాపాలు పూర్తి చేసుకొని సహకరించాల్సిందిగా కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనకాపల్లిటౌన్ : విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందినట్టు పట్టణ ఎస్‌ఐ సత్యనారాయణ చెప్పారు. ఎస్‌ఐ అందించిన వివరాలు.. ఈ నెల 21న స్థానిక రైల్వేస్టేషన్ వద్ద అనారోగ్యంతో పడి ఉన్న సదరు వ్యక్తిని ఆరా తీయగా ఊరు, పేరు చెప్పలేని స్థితిలో, చేతిపై వినోద్ అంటూ హిందీలో రాసి ఉంది. చికిత్స కోసం స్థానిక ఆస్పత్రికి తరలించగా.. విషమంగా ఉండటంతో అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సదరు వ్యక్తి మృతదేహం విశాఖ మార్చురీలో ఉంచినట్టు ఎస్‌ఐ తెలిపారు.

వినూత్నంగా గణతంత్ర వేడుకలు



మాట్లాడుతున్న స్కూల్ అధినేత పాల్‌ధర్మదాస్

అనకాపల్లిటౌన్ : 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఈ నెల 26న ఘనంగా నిర్వహించనున్నట్లు గుడ్ షెఫర్డ్ స్కూల్ అధినేత పాల్‌ధర్మదాస్ అన్నారు. గవరపాలెం స్కూల్ ఆవరణలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల సాంస్కృతిక, సాంప్రదాయ కార్యక్రమాలను 20 శకటాలపై ఏర్పాటు చేసినట్టు తెలిపారు. శకటాలపై విద్యార్థులు దేశ నేతల వేషధారణలో మువ్వన్నెల పతాకాలను చేతపట్టి సుంకరమెట్ట జంక్షన్ నుంచి నెహ్రూచౌక్ వరకూ ర్యాలీ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. స్కూల్ ఆవరణలో విద్యార్థులు రూపొందించిన నమూనాల సైన్స్‌ఫేర్‌ను తిలకించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా జడ్జి ఫణికుమార్, వైఎస్సార్ సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్‌లు పాల్గొంటారని పేర్కొన్నారు. ఉత్తమ ప్రదర్శన కనబరచిన శకటాలకు ప్రథమ బహుమతిగా ల్యాప్‌ట్యాప్, ద్వితీయ బహుమతిగా గ్రైండర్, తృతీయ బహుమతిగా స్మార్ట్‌వాచ్‌లు అందజేయనున్నట్టు వెల్లడించారు.

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీను

అనకాపల్లిటౌన్ : రోడ్డు ప్రమాదాల నియంత్రణకు యువత సహకరించాలని ట్రాఫిక్ సీఐ టి.శ్రీను అన్నారు. స్థానిక నర్సింగరావుపేట నారాయణ కళాశాలలో రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో మంగళవారం ఆయన మాట్లాడారు. యువత వాహనాలు నడిపేటపుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనాలపై పరిమితికి మించి ప్రయాణించడం, ఓవర్ స్పీడ్‌తో వాహనాలు నడపడం వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందివారికి ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

విఘ్న గణపతి సంస్థ సేవలు అభినందనీయం



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ప్రసాద్

మునగపాక : విఘ్న గణపతి సేవా సంస్థ సేవలు అభినందనీయమని ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కొనియాడారు. మునగపాకలోని సాంబశివుని ఆలయ ప్రాంగణంలో సంక్రాంతి పర్వదినాల్లో భాగంగా విఘ్న గణపతి సేవా సంస్థ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా 18 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా పేదలకు వస్త్రదానం చేస్తున్న సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు అలంక ప్రకాశరావు, అనకాపల్లి సూరిబాబులను ఆయన అభినందించారు. ఇరువురిని ఆదర్శంగా తీసుకొని మునగపాకలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ కోనపల్లి రామ్మోహనరావు, పాలసంఘ అధ్యక్షుడు మళ్ల సంజీవరావు, సూరిశెట్టి కన్నారావు, సుధారాణి,దాడి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

ఆడపిల్ల ఇంటికి ఆభరణం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషన్ సభ్యుడు గొండు సీతారాం

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం



పాల్గొన్న బాలికలు

సబ్బవరం: ఆడపిల్లలు ఇంటికి ఆభరణం వంటివారు.. వారిని భారంగా భావించ వద్దు అని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో స్త్రీ,శిశు సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ,రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని బాలికలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ దేశంలో లింగ వివక్ష,నిరక్షరాస్యత వంటి దీర్ఘకాలిక సమస్యలు దశాబ్దాలుగా వెంటాడుతూనే ఉన్నాయన్నారు. బాలికల హక్కుల ఉల్లంఘన, ఆడపిల్లలను విద్యకు దూరంగా నెట్టివేయడం, ఆడ పిల్లల్లో పోషకాహార లోపం, అనధికార విక్రయాలు వంటి పరిణామాలు జరుగుతుండడం విచారకరమన్నారు. వీటిని సమూలంగా రూపుమాపాలన్న లక్ష్యంతో ఆడ పిల్లలను ఆరోగ్యంగా ఎదగనిద్దాం, ఉన్నత విద్య అందిద్దాం,అబ్బాయిలతో సమానంగా విద్యా,ఉద్యోగ అవకాశాలు కల్పిద్దాం అనే నినాదంతో రాష్ట్రప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. దీనికోసం కోట్లాదిరూపాయి ఈ కార్యక్రమాలకు వెచ్చించి ఆడ పిల్లలపై ఉండే అభిమానాన్ని,బాధ్యతను చాటుకుంటుందన్నారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కూడా ఆడ పిల్లల హక్కులతో ముడిపడి ఉన్న అనేక అంశాలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు,సబ్బవరం ఐసీడీఎస్,చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ వి. లలిత్ కుమారి,అసిస్టెంట్ సాంఘిక సంక్షేమ అధికారి సత్యవతి, తహసీల్దార్ బి. సత్యనారాయణ, ఎంపీడీవో రమేష్ నాయుడు, పోలీస్ అధికారులు, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు,అంగన్‌వాడీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్య ఏదైనా.. సత్వర పరిష్కారం

- జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి ప్రోత్సాహం
- గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి అమర్‌నాథ్



సంక్షేమ పథకాలపై వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్



కోటవీధిలో రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్

కశింకోట : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతున్నాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. కశింకోటలోని కస్పావీధి, కుమ్మరి వీధి, గాడి వీధి, పందిరి వీధి, కోటదిబ్బ, వడ్డి వీధి, కోమటి వీధి, సలాది వీధి ప్రాంతాల్లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సుమారు మూడున్నర గంటల పాటు సాగిన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. అడుగడుగునా మహిళలు హారతులు పట్టారు. పూల వర్షం కురిపించారు. కొందరు పూలదండలు వేసి దుశ్శాలువాలు కప్పి మంత్రి అమర్‌నాథ్‌పై తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్లను అందించి, వాటిలో ఏయే పథకాలకు అర్హులో.. ఇప్పటి వరకు ఏయే పథకాల ద్వారా లబ్ధి పొందారో.. వివరించారు. పథకాలన్నీ సక్రమంగా అందుతున్నాయో.. లేదో.. అడిగి తెలుసుకున్నారు.

ప్రజలు ఈ సందర్భంగా పలు సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. సలాది వీధిలో త్రాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని, ఇంటింటికీ కుళాయిలు, బోరు ఏర్పాటు చేయాలని మహిళలు కోరారు. ఇందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పలు వీధుల్లో రోడ్లు, కాలువలు నిర్మించాలన్న స్థానికుల అభ్యర్థన మేరకు త్వరితగతిన నిధులు కేటాయించి పనులు పూర్తి చేయనున్నట్టు హామీ ఇచ్చారు. సొంతంగా స్థలం ఉండి, ఇళ్లు నిర్మించుకోవడానికి ముందుకు వస్తే మంజూరు చేస్తామన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాన్ని మరింతగా అభివృద్ధి చేయడానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పలు ప్రాంతాల్లో ఇళ్ల పరిస్థితిని పరిశీలించి లబ్ధిదారులు అడగకుండానే ఇళ్లు మంజూరు చేస్తున్నామని, ఆ స్థలాల్లో వేగంగా ఇళ్లను నిర్మించుకోవాలని మంత్రి కోరారు. అయితే కొందరు ఆర్థిక ఇబ్బందుల వల్ల నిర్మించుకోలేని పరిస్థితిని వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలను అర్హులందరికి పారదర్శకంగా అందడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని కొనియాడారు. అధికారులు కూడా అంతే బాధ్యతతో పని చేసి సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా అభివృద్ధి, సంక్షేమ ప్రదాత జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టాలని ప్రజలను కోరారు.

రక్షిత మంచినీటి పథకం ప్రారంభం

కోటదిబ్బ ప్రాంతంలో నూతన రక్షిత మంచినీటి పథకాన్ని మంత్రి అమర్‌నాథ్ ప్రారంభించారు. అలాగే రూ.5 లక్షలతో చేపట్టనున్న ఆర్‌డబ్ల్యూఎస్ పథకం అభివృద్ధి పనులను ప్రారంభించారు. సత్యసాయి బాబా మందిరంలో పూజలు చేశారు. అక్కడ నిత్య అన్నదాన పథకంలో భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. సాంబశివుని ఆలయాన్ని దర్శించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, మంత్రి జయరజని, ఉప సర్పంచ్ లక్ష్మి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, పార్టీ స్థానిక నాయకులు నడిపల్లి నాయుడు, దాసరి బాబు, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీడీవో కొంకి అప్పారావు, తహసీల్దార్ బి.సుధాకర్, వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



కశింకోట ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా

కశింకోట : స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని, నిబంధనల మేరకు సదుపాయాలు కల్పించాలని కోరుతూ అధికారులకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఏఎంఎస్ జయలక్ష్మి, బి.తులసిలక్ష్మి, పి.అంజలి, బి.కమలకుమారి, జి.పార్వతి తదితరులు పాల్గొన్నారు.